క్లుప్తంగా

డాక్టరేట్



నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని భాంజీపేటకు చెందిన కట్ల రాజేందర్‌కు కాకతీయ విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణాధికారి డాక్టరేట్ ప్రకటించారు. రాజేందర్ 'మెకానికల్ క్యారెక్టరైజేషన్ అండ్ అప్టిమైజేషన్ ఆఫ్ మెటల్ మ్యాట్రిక్– కాంపోజిట్స్' అంశంపై ప్రొఫెసర్ ఈశ్వరయ్య సారథ్యంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెకానికల్ ఇంజనీరింగ్‌లో పీహెచ్‌డీని పూర్తి చేశారు. ఈ క్రమంలోనే వర్సిటీ నుంచి ఆయన డాక్టరేట్ పట్టా పొందారు.

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా



వర్ధన్నపేట : సివిల్ సప్లయీస్ హమాలీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నేడు (సోమవారం) కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తామని సంఘం జిల్లా అధ్యక్షుడు జలగం భిక్షపతి తెలిపారు. పట్టణంలోని ఎంఎల్‌ఎస్ పాయింట్ వద్ద సివిల్ సప్లయీస్ హమాలీలు చేపట్టిన సమ్మె ఆదివారం ఐదో రోజుకు చేరుకోగా భిక్షపతి హాజరై మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోసం ఐదు రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం సరికాదన్నారు. కలెక్టరేట్ ఎదుట తలపెట్టిన ధర్నాకు హమాలీ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మోహన్, శ్రీనివాస్, రవి, సామేల్, భుజంగం తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ సేవలు



పర్వతగిరి : మండలంలోని కల్లెడలో కాజీపేట నిట్ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆదివారం సేవా కార్యక్రమం నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ జనరల్ సెక్రటరీలు అభినవ్, మానస, దివ్య పర్యవేక్షణలో విద్య, ఆరోగ్యంపై అవగాహన పెంపొందించారు. బాలికల విద్య, శక్తివంతమైన అభ్యాసంపై శిక్షణ ఇచ్చారు. వైద్యులతో వైద్యశిబిరం ఏర్పాటు చేసి గ్రామస్తులకు ఆరోగ్య పరీక్షలు చేయించారు. అనంతరం ఆర్‌డీఎఫ్ కళాశాలలో ప్రిన్సిపాల్ జనార్దన్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వైద్యపరీక్షలు చేయించారు. తదనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

ఆర్థికసాయం



రాయపర్తి : మండలంలోని కొండూరుకు చెందిన కర్ర రాజిరెడ్డి ఇటీవల మృతి చెందగా అతడి కుటుంబాన్ని అతడితో కలిసి 1998–99 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న స్నేహితులు ఆదివారం రూ.50 వేల సాయం అందజేశారు. తొలుత రాజిరెడ్డి చిత్రపటానికి అతడి స్నేహితులు నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో రాజిరెడ్డి స్నేహితులు పూస మధు, అడ్లూరి ప్రవీణ్, నిమ్మల కుమార్, రాయిని సంతోశ్, పులి అంజయ్య, కర్ర ప్రవీణ్‌రెడ్డి, యాకయ్య, కొమ్ము రాజు, ఉబ్బని నర్సింగం, కరుణాకర్, పంతంగి యాకయ్య, పూస ప్రభాకర్, కురుపాద్దీన్, గజవెల్లి వేణు, గుంటుక పెద్ద యాకయ్య, నాగరాణి, వెంకటేశ్వర్లు, పూస కృష్ణ, స్వరూప, విజయ, నజీర్ పాషా, చిదురాల సంధ్య, శేఖర్, మచ్చ రేణుక, కొమ్ము యాకయ్య, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

పాతముగ్దుంపురంలో..



చెన్నారావుపేట : మండలంలోని పాత ముగ్దుంపురం గ్రామానికి చెందిన కొండపర్తి కృష్ణమోహన్ రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతుండగా ఆయనకు వైద్యం కోసం అతడి స్నేహితులు ఆదివారం రూ.40 వేల సాయం అందజేశారు. తొలుత కృష్ణమోహన్‌తో కలిసి 2008లో బీఈడీ చదువుకున్న మిత్రులు నూనె రాములు, సతీశ్, గజదీశ్, చంద్రశేఖర్ పరామర్శించారు. అనంతరం నగదు అందజేశారు. కార్యక్రమంలో కృష్ణమోహన్ స్నేహితులు వీరన్న, రమేశ్, సురేశ్, రాము, లక్ష్మీనారాయణ, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఖానాపురం : మండలంలోని బుధరావుపేట మోడల్ స్కూల్‌లో 6 నుంచి 10వ తరగతుల వరకు ఖాళీగా ఉన్న సీట్ల కోసం అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సునీత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 6 నుంచి ఫిబ్రవరి 28 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని పేర్కొన్నారు. ఏప్రిల్ 13న ప్రవేశ పరీక్ష ఉంటుందని వివరించారు.

తాగునీటికి తప్పని తిప్పలు

- గేట్‌వాల్వ్ చెడిపోయి ఆర్నెళ్లు
- మరమ్మతు చేయించడంలో నిర్లక్ష్యం



ఖాళీ బిందెలు, బకెట్లతో నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

పర్వతగిరి : తాగునీటిని సరఫరా చేసే గేట్‌వాల్వ్ చెడిపోయింది. ఈ క్రమంలో తాగునీటికి తిప్పలు తప్పడం లేదు. ఆర్నెళ్లు గడచినా మరమ్మతు చేయించడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని కల్లెడలోని బీసీ కాలనీవాసులు ఆర్నెళ్లుగా తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీకి నీటిని సరఫరా చేసే గేట్‌వాల్వ్ గతేడాది ఆగస్టు 1న చెడిపోయింది. దీంతో ఆ రోజు నుంచి కాలనీకి నీటి సరఫరా నిలిపేశారు. ఈ క్రమంలో సుమారు 20 కుటుంబాలు ఆర్నెళ్లుగా తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. తాజాగా ఖాళీ బిందెలు, బకెట్లతో కాలనీవాసులు నిరసన తెలిపారు. అయినా అధికారులు గేట్‌వాల్వ్ మరమ్మతు చేయించడం లేదని కాలనీవాసులు మండిపడుతున్నారు. పలుమార్లు గ్రామపంచాయతీ కార్యదర్శి, ఉన్నతాధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గేట్‌వాల్వ్‌కు మరమ్మతు చేయించి తాగునీటి సరఫరా చేపట్టాలని పంచాయతీ కార్యదర్శిని కోరినా స్పందించడం లేదని కాలనీవాసులు వాపోయారు. పంచాయతీ ఎన్నికలు ముగిసి సర్పంచ్‌లు పాలన చేపడితేనే సమస్య పరిష్కారం అవుతుందని పంచాయతీ కార్యదర్శి చెబుతున్నారని కాలనీవాసులు అసహనం వ్యక్తం చేశారు. గేట్‌వాల్వ్ మరమ్మతు చేయించంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న క్రమంలో జిల్లా పంచాయతీ అధికారులు స్పందించి స్థానిక పంచాయతీ కార్యదర్శి తీరుపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవడంతోపాటు గేట్‌వాల్వ్‌కు మరమ్మతు చేయించి సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.



పాడైపోయిన గేట్‌వాల్వ్

ఆర్నెళ్లుగా ఇబ్బంది

తాగునీటి కోసం ఆర్నెళ్లుగా ఇబ్బంది పడుతున్నాం. సమస్యను పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా మొదటి రోజు మాత్రమే వాటర్ ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేసి చేతులు దులుపుకున్నారు. మరుసటి రోజు నుంచి తాగునీటి కోసం కాలి నడకన చాలా దూరం వెళ్లాల్సి వస్తోంది. గేట్‌వాల్వ్‌కు మరమ్మతు చేయించే వరకు ప్రతిరోజూ ట్యాంకర్ ద్వారా నీరందించాలి. వెంటనే మరమ్మతు చేయించాలి.

\- తారమ్మ, కాలనీవాసి

సాకులు చెబుతున్నాడు

గేట్‌వాల్వ్ పాడైపోయి తాగునీరు రావడం లేదని పంచాయతీ కార్యదర్శి చెబితే సాకులు చెబుతున్నాడు. కొత్త పైపులు వేయాలని, అందుకోసం పంచాయతీ ఎన్నికలు ముగిసి సర్పంచ్ పాలన రావాలని సాకులు చెబుతున్నాడు. గేట్‌వాల్వ్ మరమ్మతు చేయించంలో పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడు. జిల్లా అధికారులు స్పందించి పంచాయతీ కార్యదర్శి తీరుపై విచారణ చేపట్టి చర్యలు చేపట్టాలి.

\- రజిత, కాలనీవాసి

త్వరలో పనులు చేపడతాం

కల్లెడలోని బీసీ కాలనీలో గేట్‌వాల్వ్ చెడిపోయింది. ఈ క్రమంలో ఆర్నెళ్లుగా ఆ కాలనీవాసులకు తాగునీటి సరఫరా కావడం లేదు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లాము. త్వరలోనే నూతన పైపులైన్ వేయించి పనులు చేపడతాం. తాగునీటి సరఫరాను పునరుద్ధరింపజేసి సమస్యను పరిష్కరిస్తాం. అప్పటివరకు ట్యాంకర్ ద్వారా కాలనీవాసులకు తాగునీరు అందించే అవకాశాన్ని పరిశీలిస్తాం.

\- మాధవుడు, పంచాయతీ కార్యదర్శి

రైతులకు అన్యాయం చేసిన ప్రభుత్వం

- జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

దుగ్గొండి : కాంగ్రెస్ పాలనలో రైతులకు అన్యాయం జరుగుతోందని మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్ విమర్శించారు. మండలంలోని గిర్నిబావిలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలో రైతులు పదేళ్ల పాటు ఆనందంగా వ్యవసాయం చేసుకోగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అడుగడుగునా వంచనకు గురవుతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. కాంగ్రెస్ రెండు విడతలుగా రైతుబంధు చెల్లించలేదన్నారు. అధికారంలోకి వస్తే ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని నమ్మించి ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చి ఏడాది గడచినా ఇవ్వకుండా రూ.12 వేల చొప్పున ఇస్తామని ప్రకటించడం దుర్మార్గమన్నారు. పింఛన్, ఆరు గ్యారంటీలు విస్మరించారని మండిపడ్డారు. సమస్యలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు మెమోరాండం ఇవ్వడానికి యత్నిస్తే మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిని పార్టీ కార్యాలయంలోనే అరెస్ట్ చేసి నిర్బంధించారంటూ ఖండించారు. రైతుల సమస్యల పరిష్కారానికి నేడు గిర్నిబావి ప్రధాన రహదారిపై నిర్వహించనున్న నిరసనను విజయవంతం చేయాలని శ్రేణులు, రైతులు, కూలీలను కోరారు. సమావేశంలో నర్సంపేట మార్కెట్ మాజీ చైర్మన్ పొన్నం మొగిలి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సుకినె రాజేశ్వర్‌రావు, నాయకులు కాట్ల భద్రయ్య, మేర్గు రాంబాబు, పిండి కుమారస్వామి, సింగతి రాజన్న, రాజేందర్, కట్టయ్య, రాజు, రత్నాకర్‌రెడ్డి, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాల మంజూరు చేయాలి

- అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న శ్రీనివాస్

నర్సంపేట : నర్సంపేటకు పాలిటెక్నిక్ కళాశాల మంజూరు చేయాలని పాలిటెక్నిక్ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అజ్మీర శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని ఆదివారం కలిసి వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. నర్సంపేట ప్రాంత యువతకు సాంకేతిక విద్య అందుబాటులోకి తెచ్చేలా పాలిటెక్నిక్ కళాశాల మంజూరు చేయించాలని చెప్పారు. అనంతరం అసోసియేషన్ క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు బత్తిని రాజేందర్, స్థానిక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఓర్సు తిరుపతి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు తుమ్మలపల్లి సందీప్, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కత్తి కిరణ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పేద రెడ్డి కులస్తుల సంక్షేమానికి ప్రాధాన్యం



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న తిరుపతిరెడ్డి, తదితరులు

- సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి తిరుపతిరెడ్డి

నల్లబెల్లి : పేద రెడ్డి కులస్తుల సంక్షేమానికి రెడ్డి సంక్షేమ సంఘం ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర కార్యదర్శి చిట్యాల తిరుపతిరెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని సుమంగళి ఫంక్షన్ హాలులో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెడ్డి కులంలోనే అనేక మంది పేదలు ఉన్నారని చెప్పారు. విద్య, వైద్యం, ఉద్యోగం, ఉపాధి ఇతర రంగాల్లో పేద రెడ్డి కులస్తులు తీవ్ర వెనుకబాటు గురవుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పేద రెడ్డి కులస్తుల సంక్షేమానికి పాటుపడుతుందని చెప్పారు. అనంతరం సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మల్లాడి జయపాల్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా చార్ల శివారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఇట్టె కృష్ణారెడ్డి, కోశాధికారిగా సంకపెల్లి రామచంద్రారెడ్డి, ప్రచార కార్యదర్శిగా పరుపాటి రవీందర్‌రెడ్డితోపాటు కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. తదనంతరం సంఘం 2025 క్యాలెండర్ తిరుపతిరెడ్డి విష్కరించారు. సమావేశంలో నాయకులు మల్లాడి సాంబరెడ్డి, తాటిరెడ్డి, రాజిరెడ్డి, చిట్యాల వెంకట్‌రెడ్డి, రేవూరి నర్సింహారెడ్డి, కాసర్ల నర్సింహారెడ్డి, కాసం మదన్‌మోహన్ రెడ్డి, పోరెడ్డి రవీందర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, యాకూబ్‌రెడ్డి, పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నివాళి

పర్వతగిరి : మండలంలోని మాల్యతండాకు చెందిన భానోతు మణి అనారోగ్యంతో ఆదివారం మృతి చెందగా ఆయన మృతదేహానికి కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్ నాయక్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అంత్యక్రియలకు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు భూక్యా శ్రీనివాస్, నాయకులు భానోతు హాము, నర్సింహ, భూక్యా సోమ, భూక్యా పంతులు, లాలు, ఈర్యా, లచ్చు, సంతోశ్, వెంకన్ననాయక్ తదితరులు పాల్గొన్నారు.

శివరామపురంలో..

రాయపర్తి : మండలంలోని శివరామపురం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు నాగపురి శ్రీనివాస్ మృతి చెందగా అతడి మృతదేహానికి మాజీ మంత్రి దయాకర్‌రావు నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఏకేతండా మాజీ సర్పంచ్ మూడు రంగమ్మ కుమారుడు చక్రు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా దయాకర్‌రావు పరామర్శించారు. కార్యక్రమాల్లో మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, బీఆర్‌ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, నాయకులు తాళ్లపెల్లి సంతోశ్ గౌడ్, నాగపురి సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ హయాంలోనే దళితుల అభివృద్ధి'

వర్ధన్నపేట : కాంగ్రెస్ హయాంలోనే దళితుల అభివృద్ధి జరుగుతుందని దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం (డీఎన్‌ఎస్‌ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి తెలిపారు. పట్టణంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం భూమి లేని పేద దళితులకు మూడెకరాల సాగు భూమి ఇస్తామని హామీ ఇచ్చినా అమలు చేయలేదన్నారు. భూమి లేని దళితులకు భూమి ఇవ్వాలని, భూమి కొనుగోలును ఎకరాకు రూ.40 లక్షలకు పెంచాలని, కులాంతర వివాహితులకు ప్రోత్సాహకాన్ని రూ.5 లక్షలకు పెంచాలని కోరారు. సమావేశంలో నాయకులు సమ్మయ్య, మిథున్, బాబు తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక



అధ్యక్షుడు ఉపేందర్

ఖానాపురం : మండలంలోని బుధరావుపేటలో కాకతీయ ట్రాక్టర్స్ యూనియన్ కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా చెడిపాక ఉపేందర్, ఉపాధ్యక్షుడుగా సయ్యద్ ఇక్బాల్, కార్యదర్శిగా సంపత్, కోశాధికారిగా యాకాంతం, సలహాదార్లుగా లాల్ సాహెబ్, నర్సయ్య, సుదర్శన్, సభ్యులుగా నర్సయ్య, శుకూర్, శ్రీను, కుమార్, రాజు, కృష్ణ ఎన్నికయ్యారు. అనంతరం అధ్యక్షుడు ఉపేందర్ మాట్లాడారు. ట్రాక్టర్ల ఓనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

మధ్యాహ్న భోజనానికి విరాళం

సంగెం : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం కోసం గీసుకొండ మండలంలోని మరియపురం మాజీ సర్పంచ్ అల్లం బాల్‌రెడ్డి ఆదివారం రూ.10 వేల విరాళం అందించారు. అధ్యాపకులు కళాశాలలో విద్యార్థులకు దాతల సహకారంతో గత డిసెంబర్ 19న మధ్యాహ్న భోజన ఏర్పాటును ప్రారంభించగా బాల్‌రెడ్డి స్పందించి విరాళం అందజేశారు. నగదును కళాశాల అధ్యాపకుడు మామిళ్ల బుచ్చిరెడ్డికి అందజేశారు.

అరెస్ట్, విడుదల



ఖానాపురం : జిల్లాలో డిప్యూటీ సీఎం పర్యటన నేపథ్యంలో మండల కేంద్రానికి చెందిన ఎంఐఎస్ కోఆర్డినేటర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రావుల రాజేందర్‌ను స్థానిక పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. అనంతరం సాయంత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా రాజేందర్ పోలీస్‌స్టేషన్‌లో నిరసన తెలిపారు.

విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోవాలి

పర్వతగిరి : ఇటీవల మృతి చెందిన మాసాని దిలీప్‌కు కారకులైన విద్యుత్ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మండలంలోని ఏనుగల్ గ్రామంలోని ప్రధాన రహదారిపై దిలీప్ కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు ఆదివారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆందోళనకారులు మాట్లాడారు. దిలీప్ ఇంటిపై నుంచి 11 కేవీ విద్యుత్ వైర్లు వెళ్లాయని, అవి స్లాబుకు దగ్గరగా ఉండడంతో ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని గతంలో విద్యుత్ శాఖ ఏఈకి పలుమార్లు చెప్పినా పట్టించుకోలేదని చెప్పారు. ఏఈ నిర్లక్ష్యం వల్లే దిలీప్ విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడని తెలిపారు. స్థానిక సీఐ రాజగోపాల్, ఎస్సై ప్రవీణ్ ఘటనా స్థలికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. బాధిత కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని, బాధ్యుడైన ఏఈని సస్పెండ్ చేయాలని ఆందోళనకారులు డిమాండ్ చేయగా విద్యుత్ శాఖ డీఈతో సీఐ మాట్లాడి ఎక్స్‌గ్రేషియా ఇప్పించేలా చూస్తామని, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చి రాస్తారోకో విరమింపజేశారు.

రిజర్వేషన్ లక్ష్యంగా ఉద్యమిస్తాం

- పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్



సమావేశంలో మాట్లాడుతున్న రాజేశ్

వర్ధన్నపేట : స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు రిజర్వేషన్లు కల్పించడమే లక్ష్యంగా ఉద్యమిస్తామని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేశ్ తెలిపారు. పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి సుమారు 8 దశాబ్దాలు కావస్తున్నా దివ్యాంగులు రాజ్యాధికారానికి నోచుకోవడం లేదని ఆందోళన వెలిబుచ్చారు. రాజకీయ పార్టీలు దివ్యాంగులను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్నాయని చెప్పారు. దివ్యాంగులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాల్సిన బాధ్యత అన్ని రాజకీయ పార్టీలపైనా ఉందన్నారు. ఇకనైనా రాజకీయ పార్టీలు స్పందించి అన్ని ఎన్నికల్లోనూ దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించేలా కార్యాచరణ ప్రకటించాలని కోరారు. రాజస్థాన్, చత్తీస్‌ఘఢ్ రాష్ట్రాల తరహాలో తెలంగాణలోని దివ్యాంగులకు స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రత్యేక రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు షరీఫ్, నాయకులు ఈదయ్య, జాదవ్ పండరి, మోహన్, సుజాత, బ్రహ్మం, షేక్ ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయం



మాట్లాడుతున్న ఎస్సైలు చందర్, రాజు

- ఎస్సైలు చందర్, రాజు

వర్ధన్నపేట : రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు స్థానిక ఎస్సైలు చందర్, మెరుగు రాజు తెలిపారు. పట్టణంలో ఎస్సై మెరుగు రాజు ఆధ్వర్యంలో పోలీసులు, వాహన చోదకులు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సైలు చందర్, రాజు వాహనదారులకు గులాబీ పూలు అందజేసి మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలతో పలువురు మృతి చెందుతుండగా కుటుంబాలు వేదనకు గురౌతున్నాయని తెలిపారు. సమాజంలోని ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకుంటే రోడ్డు ప్రమాదాలను నివారించొచ్చని చెప్పారు. ద్విచక్ర వాహనదార్లు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లు నడిపే వ్యక్తులు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. వాహనాలకు సంబంధించిన పత్రాలతో డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని చెప్పారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వొద్దన్నారు. మైనర్లు వాహనాలు నడిపి ప్రమాదాలు చోటు చేసుకుంటే బాధ్యులైన తల్లిదండ్రులపైనా కేసులు తప్పవని తెలిపారు. ఆటోల్లో సామర్థ్యానికి మించి ప్రయాణికులను తీసుకెళ్లొద్దని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు.

అరెస్టులు అప్రజాస్వామికం

- బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు వెంకటనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటనారాయణ

నర్సంపేట : ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అరెస్టులు చేయడం అప్రజాస్వామికమని బీఆర్‌ఎస్ పట్టణ కమిటీ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్ అన్నారు. స్థానిక మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అరెస్టును ఆయన ఖండించారు. పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అక్రమ అరెస్టులతో ప్రభుత్వాన్ని నడపలేరని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు, రైతు డిక్లరేషన్‌తో అధికారంలోకి వచ్చి మోసపూరిత పాలన సాగిస్తోందని విమర్శించారు. మోసపూరిత కాంగ్రెస్ వైఖరిని ప్రజల్లో ఎండగతామన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మునిగాల వెంకట్‌రెడ్డి, ఖానాపురం మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, న్యాయవాది కొమ్ము రమేశ్, బీఆర్‌ఎస్‌కేవీ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజ, బీఆర్‌ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి వేణుముద్దల శ్రీధర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ మండల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ గడ్డం శ్రీనివాస్, సంపంగి సాలయ్య, దేవేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు వెంటనే నెరవేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

నర్సంపేట రూరల్ : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ డిమాండ్ చేశారు. నర్సంపేటలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు భరోసా కింద ఎకరానికి రూ.15 వేలు అందిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక రూ.12 వేలు అందిస్తామని మాట మార్చడం సరికాదన్నారు. రైతులకు కేవలం రూ.20 వేల కోట్ల రుణమాఫీ చేతులు దులుపుకుందని ప్రభుత్వ తీరును ఎండగట్టారు. సమావేశంలో ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఈర్ల నర్సింహరాములు, మోతె జైపాల్‌రెడ్డి, కోమాండ్ల గోపాల్‌రెడ్డి, మోటూరి రవి, కోడారి రవి, భూక్య వీరన్న, కడారి కుమారస్వామి, జర్పుల వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నాటి ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

దుగ్గొండి : మండలంలోని తిమ్మంపేట హైస్కూల్‌లో 2000–01 విద్యాసంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు పాఠశాల ఆవరణలో ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. అనంతరం నాటి ఉపాధ్యాయులైన చంద్రమౌళి, రాజేశ్వర్‌రావు, జయప్రద, షహానా పర్వీన్, సారంగపాణి, సమ్మిరెడ్డి, యాకయ్యలను శాలువాలు పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రస్తుత హెచ్‌ఎం ప్రకాశ్, పూర్వవిద్యార్థులు దండు కరుణాకర్, పాలడుగుల శివ, నాగెల్లి సుభాష్, రఘు, కరుణాకర్, కృష్ణంరాజు, శంకర్, రాజేందర్, రమేశ్, రాజు, శైలజ, ఝాన్సీ, విజయ, రమ, శ్వేత తదితరులు పాల్గొన్నారు.